# ఎన్నోరంగుల తెల్లకిరణం
## - సిరివెన్నెల సీతారామశాస్త్రి



*(సిరివెన్నెలగారు వ్రాసిన కథలు నెలకొకటి)*

**సంకల్పం**

సాహిత్యంలో 'కథ' (short story)కి సంబంధించిన నిర్వచనాలూ, నియమావళి, ఆవిర్భావం. ఆకృతి, పరిణామము, పరిణితి ఇత్యాది అంశాలపట్ల నాకు నిర్దిష్టమైన అవగాహన ఉంది - అని నేను అనుకోను. కథా సామ్రాజ్య నిర్మాతల, నిర్ణేతల సరసన నిలచి తర్కించే తాహతు నాకుందని కూడా అనుకోలేను.

'ఏం చెప్పాలి' అనే దానికన్నా 'ఎలా చెప్పాలి?' అనే అంశంపట్లే నాకు ఎక్కువ మక్కువ.

కనుక, నా కథల్లో ఇంతవరకు స్పృశించబడని, కనని, వినని అపురూపమైన 'వస్తువు' ఉందని దబాయించను.

కథా కథన విధానంలో, రసపోషణ, నిర్వహణ వగైరా సాంకేతికాంశాలపట్ల నాకున్న పరిజ్ఞానం బహు తక్కువ.

'కథ చెప్పడం' అనేది ఎప్పుడో అయిపోయింది - "with all its totality & perfection" అనేది నా నమ్మకం.

'ఎలా చెప్పడం' అనేది ఎప్పటికీ అయిపోదు అనేది కూడా నా నమ్మకం.

'అతి పాత', 'మామూలు' విషయాలే ఒక్కొక్కప్పుడు నా గుండెను కొత్తగా, బలంగా 'తాకిన' అనుభూతి కలిగినప్పుడు, ఆ అనుభూతిని యథాతథంగా 'మాటల్లో'కి అనువదించడానికి నేను చేసిన ప్రయత్నాన్ని చాలామంది కథా సాంకేతిక నిపుణులు 'ఇది, ఇలాంటిది కథే కాదు పొమ్మన్నారు.'

'కాబోసు' అనుకున్నాను గాని, తెగబడి 'ఏం? ఎందుక్కాదు?' అని ఎదురు తిరిగే ప్రయత్నం చెయ్యలేదు. 'కానీలే! నాదో 'మాలోకం' అయి ఉంటుందని ఊరుకున్నాను.

నా 'మాలోకం'లో జనాభా లెక్కల సేకరణ జరిగితే, నేను గాక ఇంకా ఎవరైనా ఉన్నారా, ఉంటారా అని తెలుసుకోవాలనే నా ఆరాటం గత ముప్పై సంవత్సరాలుగా నన్ను వెన్నంటే ఉంది.

ఆ 'రీసెర్చి'లో భాగంగా ఇలా నా 'స్వగతాలన్నీ' ఓ సంకలనంగా పోగుచేసి అన్వేషణకి పంపిస్తున్నాను.

(సీతారామశాస్త్రి)

**ఆప్త వాక్యం**

సిరివెన్నల సీతారామశాస్త్రికి గతంలో 'భరణి' అనే కలం పేరుండేది. ఈ కథలన్నీ పూర్వాశ్రమంలో ఆ పేరుతో రాసినవే. స్వామీజీ అయిన తర్వాత పూర్వనామం వదిలివెయ్యటం ఒక సంప్రదాయం. అలాగే పాటల మేస్త్రి అయిన తర్వాత 'భరణి' అనే పాత

పేరుని వదిలి పెట్టి సిరివెన్నెలగా మారాడు. పాటల తపస్సులో మునిగిపోయాడు. పాట రచయితగా... 'వెన్నెల' కురిపిస్తున్నాడు. అయితే ఈ కథలు వదిలెయ్యకుండా పుస్తకరూపంలోకి తెస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

ఇందులో చాలా కథలు.. పురుడు పోసుకోవటం నాకు తెలుసు. వీటికోసం అతను పడ్డ పురిటినొప్పులు నాకు తెలుసు. మూడు పదులుకి పైగా మేము ప్రాణస్నేహితులం. భుజాలు చరుచుకుంటూ పత్రికలకి కథలు రాసాము. అదే విధంగా ఇద్దరూ, చెట్టాపట్టాలేసుకుని సినిమాల్లోకి వచ్చాము. నేను మాట - అతను పాట.. చాలా సినిమాలకి అందించాము. మా స్నేహం జీవితంలాగా మాతోపాటు పెరుగుతూ వస్తోంది.

తెల్లకిరణం. పైకి ఒకే రంగులా కనపడ్డా విశ్లేషిస్తే ఎన్నో రంగులు కనబడతాయి. జీవితం కూడా అంతే. మంచీ చెడ్డా - ఆనందం, దుఃఖం, అన్నీ కలగలిపి ఉంటాయి. విశ్లేషణకు దిగితే ఒక్కొక్క రసం.. ఒక్కొక్క రంగు స్ఫుటంగా తెలుస్తాయి. సరిగ్గా ఈ సంపుటిలో ఏడుకథలున్నాయి. వీటిల్లో జీవితం ఉంది.

'ఎన్నోరంగుల తెల్లకిరణం' - ఒక మధ్య తరగతివాడి కథ. ఇంట్లో ఏదో కార్యక్రమం జరిగింది. బంధువులంతా వచ్చారు. చాలా హడావిడిగా ఉంది. అయితే జరిగిన ఆ కార్యక్రమం ఏమిటో చెప్పకుండా, కథను ఉత్కంఠతతో నడిపిస్తాడు రచయిత. కార్యక్రమం గురించి చెప్పకుండానే జీవితంలో వివిధ అనుభూతుల్ని పరిచయం చేస్తాడు. వాటి తాలూకు భావ ఉద్వేగాలకు మనల్ని లోను చేస్తాడు. కథంతా కలిపి మూడు ముక్కలు. అయితే విశ్లేషణ ఆలోచింప చేస్తుంది.

"నీ కథలో నీతి ఏమిటయ్యా?" అని ఒక రచయితని అడిగితే - నా కథలో జాలి కనపడుతుంది అన్నాట్ట ఆ రచయిత. అలాగే.. శాస్త్రి కథల్లో ఏమి కనపడుతుందయ్యా అంటే... మనసు కనబడుతుంది. మనిషి అంతరంగపు ఆలోచనలు కనబడతాయి. తాత్వికత గోచరిస్తుంది. పాత్రల మనోభావాలు స్పష్టంగా ఆవిష్కరించటం వల్ల, పాత్రలు సజీవంగా కళ్ళముందు నిలబడతాయి.

ఈ సంపుటిలోని రెండు కథల్లో విశ్వపతి కిరీటి కనబడతారు. విశ్వపతి గీతోపదేశం చేసినట్టు. జీవితానికి నిర్వచనాలు ఇస్తూంటాడు. కిరీటి ద్వారా మనం తెలుసుకుంటాము.

అరిటి చెట్టుని కొట్టి పొరలు పొరలుగా వలుస్తారు దూటకోసం. అలాగే - మనిషి అంతరంగాన్ని పొరలు పొరలుగా విడదీసి నిగ్గుతీసి మనకు చెప్తుంటాడు విశ్వపతి.

"కార్తికేయుని కీర్తికాయం" కథలో కార్తీక్ అట్టడుగు పొరల్లో ఆలోచనలు మనకి ఆవిష్కరింపబడతాయి. చిన్నపిల్లలు.. తల్లి ఎటన్షన్ కోసం కనబడ్డవాటినల్లా విరగగొడతారు. కొందరు పెద్దవాళ్ళు తమను తామే విరగ్గొట్టుకుంటారు. వాళ్ళకి సానుభూతి కావాలి. వాళ్ళ కష్టాల్లో ఎవరైనా ఆదుకోవటం వాళ్ళకి ముఖ్యం కాదు. అంతరంగం పంచుకోవటం, వాళ్ళకి ప్రధానం. ఈ కథా నిర్మాణం.. శైలి.. మనల్ని ఆకట్టుకుంటుంది. కథ చదివిన తర్వాత మనలో ఎన్నో ఆలోచనలు రేకెత్తిస్తుంది. "ప్రపంచం ఎంత విశాలంగా ఉన్నా ఎవడికి వాడు ఒంటరివాడేనన్న భావన కలుగుతుంది" మనలోని తాత్వికుడ్ని నిద్రలేపుతాడు రచయిత కథలో ఒకచోట...

"నేను మిమ్మల్ని నమ్మించగలిగితే తర్వాత నేనుండను. మీ నమ్మకం, నా జీవితం రెండూ కలిసి బతకలేవు అంటాడు. ఇది కథలో పాత్ర పలుకుల్లా అనిపించవు. గుండె లోతుల్లోంచి మనిషి మాట్లాడే మాటల్లాగా అనిపిస్తాయి.

"తిరుగుబాటు" కథ కూడా విషాదయోగంలో ఉన్న కిరీటికి - విశ్వపతి గీతోపదేశమే మనల్ని చాలామంది ద్వేషించవచ్చు. కారణం ఏమిటో మనకు తెలియదు. మనం ఆందోళనకు లోనవుతూ ఉంటాము. ఈ కథలో చిట్టిరాజు ద్వేషానికి కారణం ఏమిటో కిరీటికి అర్ధమయ్యేలా చెప్తాడు విశ్వపతి. ఆ తర్వాత మనిషిలో ఉండే అసలు మనిషి విశ్వరూపం మనకి అర్ధం అవుతుంది.

ఈ సీతారామశాస్త్రి కథల సంపుటిలోని కథలన్నీ వేటికవే అన్నట్టున్నా కథానాయకుడి పేర్లు వేరుగా కనిపించినా అన్నిటిలో ఉండే మూర్తి ఒక్కటే. అది మధ్యతరగతి మూర్తి. ఆ మధ్య తరగతి మందహాసం ప్రతి కథలోనూ కనబడుతుంది.

"మరో సింద్‌బాద్" కథలో మధ్యతరగతి వాడి ఆశలు.. కలలు.. తప్పని నిజాయితీ... సాగితే మోసం చేద్దామనే ఆలోచన.. చాలా బాగా చిత్రీకరించాడు రచయిత. కథ చదువుతున్నంతసేపు మనమైనా ఇలాగే చేస్తాం. అని అనిపించకమానదు. కారణం రచయిత జీవితానికి దూరంగా కథను తీసుకెళ్ళలేదు. గాఢవాస్తవికత కథలో మనల్ని కట్టి పారేస్తుంది.

ఈ కథల్లో ప్రముఖంగా ఎన్నదగిన మరో కథ "మహాశాంతి". ఈ కథ పుట్టడం నాకు బాగా గుర్తుంది. ఈ కథను 28సార్లు రాశాడు రచయిత.

ఇన్నిసార్లు కథ రాశాడు అంటే కథనో, కథా శిల్పాన్నో మార్చి రాశాడని భావించవచ్చు. తిరిగి తిరిగి రాసి ఆ కథమీద అంత అభిమానాన్ని పెంచుకున్నాడు. తన బిడ్డని 28సార్లు గుండెలకి పొదుపుకున్నాడు. కవిత్వం మీద మక్కువతో నగిషీలు చెక్కాడు. నిజంగా గొప్ప కథ.. గుండెలు పిండే విషాదం.

సీతారామశాస్త్రి పుడుతూనే కవిగా పుట్టాడు. అందుకే కథ చెప్పటానికి కూర్చున్నా కవిత్వమే తన్నుకొస్తుంది వాక్యాలు వాక్యాల్లా ఉండవు. బాగా దట్టించిన తారాజువ్వల్లా ఉంటాయి. మన ఆలోచనల్ని ఆకాశంలోకి పరుగులు తీయిస్తాయి. ఈ కథలోనే మచ్చుకి కొన్ని –

ఆ ఊళ్ళో "ఏ కొంపల్లో అగ్గి రాజటంలేదు. కాని కొంపలన్నీ అగ్గిలా రాజుతున్నాయి"

"చరిత్రలో ప్రతి అధ్యాయం ఒక నాయకుడి మకుటం క్రింద విస్తరిస్తుంది"

"ఆకాశం.. తూర్పు పడమరలుగా రెండుసార్లు రక్తాన్ని ఆచమనం చేసింది"

ప్రతి వాక్యంలోను కవిత్వం తొంగి చూస్తుంది.

"ఊరంతా అనగా ఎంత? గుండెలోంచి ఎగదోసుకు వస్తున్న నిట్టూర్పు నిడివంత" అంటాడు కథ మొదటి వాక్యంలోనే. దాంతో పాఠకుడు ఒక మూడ్‌లోకి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత కథా చదువుతున్నంతసేపు రాజయ్యతోపాటు మనం కూడా ఊళ్ళో కలయతిరుగుతున్నట్టు అనిపిస్తుంది. శాంతికోసం జరిగే హింస మనకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. కళ్ళనీళ్ళు తెప్పిస్తుంది. ఇలాంటి కథ 58సార్లు రాసినా తప్పులేదనిపిస్తుంది.

మహాశాంతి తర్వాత శాస్త్రి రాసిన కథల్లో కవిత్వం ఇంకా ఎక్కువగా కనబడుతుంది. కథారచయితకి కావాల్సింది ముక్కుసూటిదనమా? కవితా లక్షణమా? అంటే అనుభూతి కలిగించటానికి దేనిమీద ఆధారపడినా ఒక్కటే. అయితే ఏదీ అతికాకూడదు.

కథలో మంచి సంఘటన ఉండాలి వాతావరణ చిత్రణ బాగుండాలి. వాస్తవంగా జరిగిన సంఘటనలా ఉండాలి. అంటే లాజిక్ అవరోధం కాకూడదు. ఏది సరిగ్గా లేకపోయినా దృశ్యం మనకు తెరమీద ఫోకస్ కాదు. బొమ్మ మసక మసకగా ఉంటుంది. అనుభూతి కలగనివ్వకుండా అడ్డం పడుతుంది.

సీతారామశాస్త్రిలోని గొప్ప కవి పూర్తిగా రెక్కలు విప్పుకోవటం మొదలెట్టిన తర్వాత కథకుడ్ని కవి డామినేట్ చెయ్యటం ఆరంభించాడు. కథని శిల్పాలుగా చెక్కటం మొదలుపెట్టాడు. దానికి ఉదాహరణ చరిత్ర బోరులు కథ. అడుగుడునా పొయిట్రీ ఉంటుంది. కథను కవిత్వం డామినే ట్ చేస్తుంది. 'నెయ్యి వాసనతో రొట్టెకి రుచిరావాలికాని, రొట్టె నెయ్యిలో తడిసిపోకూడదు. తడిసిపోతే రొట్టె అనిపించబడదు.' కథ శిల్పంకాని, కవిత్వంకాని కథా ప్రసన్నతకు అడ్డం రాకూడదు. అలా వస్తే కథలకోసం రచయిత చేతినించి జారిపోతాయి. శిల్పరీత్యా గొప్ప కథే అయినా, పాఠకులు పూర్తిగా ఆనందాన్ని ఆస్వాదించే అవకాశం లేకుండా పోతుంది. అలాంటి కథగా ఇందులో 'పోస్టుమార్టం' కథ కనబడుతుంది.

కథలో పాత్రలు కథ చెప్పటానికి కొంత పూనుకుంటాయి తప్ప రచయిత చెప్పడు. ఏదో గొప్ప కథ చదువుతున్న అనుభూతి. తీపితీపిగా నోటికి మధురమైన మాటలు తగుల్తాయి. భావం బోధపడుతున్నట్టే ఉంటుంది. బోధపడదు. కారణం ఇందాక నేను చెప్పిందే

కథకుడ్ని కవి డామినేట్ చెయ్యటమే. కథలో అడుగడుగునా తాత్త్వికత, కవిత్వం కనబడుతుంది. ఏదైనా పోస్టుమార్టం కథ విభిన్నమైన కథా శిల్పానికి ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. సీతారామశాస్త్రి, కథలన్నింటిలో కనిపించే తాత్త్వికుడు – ఈ కథలో ఇంకా విశేషంగా కనిపిస్తాడు.

మొత్తానికి 'ఎన్నో రంగుల తెల్లకిరణం'లోని కథలు జీవితాన్ని అద్దంలో చూపిస్తాయి. అలా చూపించటంలో సీతారామశాస్త్రి కృషి నిజాయితీ పూర్తిగా కనబడతాయి. మంచి కథలు చదివిన అనుభూతి కలుగుతుంది.

సిరివెన్నెల సీతారామశాస్త్రి గీతరచయితగా విశ్వవిఖ్యాతి చెందాడు నాకు ఆనందమే. అయితే అతనిలో కథకుడ్ని అప్పుడప్పుడు పైకితీసి ఇలాంటి మంచి కథలు రాస్తే నేనేకాదు తెలుగుపాఠకులంతా ఆనందిస్తారు. తొందరలో రాస్తాడని ఆశిస్తూ...

**స్వస్తి.**

**ఆకెళ్ళ**

*మహాశాంతి*

కాటికాపరిలాగా ఊరంతా కలియదిరుగుతున్నాడు రాజయ్య. ఊరంతా అనగా ఎంత? గుండెలోంచి ఎగదోసుకు వస్తూన్న నిట్టూర్పు నిండినంత.

ఏదో ఒక మూల, ఏ కొంపలోనైనా ఏదో ఒక చిన్నదైనా రోదన ధ్వని వినిపించకపోతుందా అని ఆశగా వెతుక్కుంటూ ఊరంతా చుట్టబెట్టింది గాలి. నిరాశగా వెనక్కి వచ్చి రాజయ్యతోబాటు కుంటుతూంది.

ఏడుపు చావుకి వారసత్వంగా మిగిలి ఉన్న బ్రతుక్కి చిహ్నం. కానీ కాలుతూన్న కాష్టాన్ని కాటికి వదిలి, ఏడుస్తున్న బ్రతుకు దూరంగా వెళ్ళిపోతోంది.

'అందరూ ఎల్లినారు గాఁవాల పట్నానికి. పట్నమ్లు కోత జరుగుద్ది గావాల. అదయినాక దెచ్చుకునేందుకు ఎల్లినారన్నమాట. ఏటి దెచ్చుకుంటరు తల్లీ. ఏటి దెచ్చుకుంటారమ్మ' గొణుక్కున్నాడు రాజయ్య.

కొంపల్లో ఎక్కడా అగ్గి రాజటంలేదు కానీ, కొంపలన్నీ అగ్గిలా రాజుతున్నాయి. ఊరుదాటి చేలగట్ల దగ్గరకు వచ్చాడు.

అరవయ్యేళ్ళ గతంలోకి, అనంతమైన భవితవ్యంలోకి విశాలంగా, లోతుగాపరుచుకున్న రాజయ్య కళ్ళు ఆకాశంలోకి ప్రతిఫలిస్తున్నాయి పచ్చని పొలాలు. చూపుమేర కనిపించేదంతా పొలాల పచ్చదనమే. ఆ చూపు చివర్నెక్కడో, అనంత నీలిమ అవనిపైకి వాలి, పచ్చదనానికి పరాకాష్టనీ, అంతిమ మజిలీని చూపిస్తోంది.

వెనక్కి తిరిగి చెరువు కట్టమీద నుంచి రామాలయాన్ని చుట్టి, రచ్చబండవైపు నడుస్తున్నాడు.

దారిలో రాజయ్యని వదిలి, రామాలయంలోకి వెళ్ళి వచ్చింది గాలి, గర్భగుడిలో పూజారిగారు, రాముడి దగ్గర భగవద్గీత ముందు పెట్టుకుని కూర్చున్నారు ఒంటరిగా మౌనంగా చదవటంలేదు. 'కనీసం భగవద్గీత వినిపించినా బాగుండును' అనుకుంటూ నీరసంగా, నిశ్శబ్దంగా, వెనక్కి రాజయ్య దగ్గరకి వచ్చింది గాలి.

ఒక ఉచ్ఛ్వాసానికీ, మరో నిశ్వాసానికీ మధ్య దూరమంత చిన్న ఊరు అనిపించవచ్చు ఈ నడివిని మెదడులో కొలిస్తే కాని, రాజయ్య ఆ ఊపిరి మధ్య దూరాన్ని గుండెతో కొలుస్తున్నాడు. ఆ కొంత అలుపు కలిగించేంత దూరంగా ఉంది. ఆ నడక బరువుగా ఉంది.

మనిషికి పుట్టుక చావు, ఇల్లు స్మశానం ఎలా అనివార్యాల్లో గ్రామానికి రామాలయం కల్లుపాక అలాగే అనివార్యాలు. కల్లుపాక ముందు బల్లమీద కూర్చున్నాడు రాజయ్య.

తనలో జరుగుతోన్న అంతర్మథనం ఏమిటో అర్థం అవటంలేదతనికి. చెట్టంత కొడుకు కట్టెదుట కాటికి వెళ్ళిపోయి కొన్ని గంటలు కాలేదింకా, అయినా, ఆ విషాదానికి మాత్రమే పరిమితం అవలేదతని అంతరంగం. అంతకు మించిన మరేదో ఆరాటం. ఇంకేదో ఆవేదన.

విషం శరీరంలోకి ప్రవేశించాక, తను తట్టుకో గలిగినంత మేరకి ఆ విషాన్ని ఇముడ్చుకునేందుకు తెగ గింజుకుంటుంది శరీరం. రాజయ్య మనస్సు, తను జీర్ణించుకోలేని ఏదో అనుభూతిని ఇముడ్చుకునేందుకు తెగ ఆరాట పడుతోంది.

చుట్టూ కలయజూసాడు. తనూ, ఆకాశం తప్ప మరెవ్వరూ లేరు. ఏదో అందామని ఉంది మరేదో అనుకుందామనీ ఉంది.

'ఏటీ!.. జెవానెడీ' పైకే గొణుక్కున్నాడు. అదికాదు తను అనుకుంటున్నది. అదికాదు తను అందామనుకున్నది. కూర్చోలేకపోతున్నాడు. నిలబడలేకపోతున్నాడు లేచి కల్లుపాకలోకి వెళ్ళాడు.

కల్లుకుండలు అలాగే ఉన్నాయి. మూతలు కూడా తీసేసి. సగం సగం త్రాగిన గ్లాసులు, చెల్లాచెదురుగా పడి ఉన్న గాజు పెంకులు, వాటి మధ్య మట్టి నేలలోకి ఇంకిపోయిన కల్లు మరకలు, పుల్లకి గుచ్చి కాల్చిన మాంసపు ముక్కలు ఆ విందును చూస్తూ తిరుగుతోన్న రెండు కుక్కలు, ముసురుకుంటూ, నెత్తుటి మరకలు. చేరెడేసి మేర అట్టకట్టేసిన నెత్తుటి చారికలు.

'ఆ మూల.. అల్లదుగో అక్కడే. జోగులాడి శవం ఉండాల నిన్న సందేల' అనుకున్నాడు రాజయ్య.

జోగులు రాజయ్యకి ఏకైక సంతానం వాడు తప్ప ఈ ప్రపంచంలో నా అనే వాళ్ళెవరూ లేదు రాజయ్యకి. అలాంటి కొడుకు శవం గురించి ఇలా ఇంత నిర్లిప్తంగా అనుకుని ఉండడు రాజయ్య. ఆ మృత్యువు మరోలా వచ్చి ఉంటే.

జోగులు శవానికి గుర్తుగా రాళ్ళు పెట్టి, శవాన్ని తీసుకువెళ్ళిపోయారు పోలీసులు.

పదడుగుల అవతల పాక ప్రక్కన 'ఆ రాళ్ళ గురుతులున్నసోట ముత్తేల్నాయుడి పీక, మొండెం పడున్నాయి నిన్న' అనుకున్నాడు రాజయ్య.

ముత్యాల్నాయుడు రత్నంగారి కుడి భుజం. జోగుల్ని నిన్న ముత్యాల్నాయుడే నరికేశాడు తన కన్నకొడుకుని చంపిన వాడి చావు గురించి ఇలా ఇంత నిర్వికారంగా అనుకుని ఉండడు రాజయ్య. ఆ మృత్యువు మరోలా వచ్చి ఉంటే?

నిన్న సాయంకాలం, కాలం మరికొన్ని జీవితాలకు కూడా తీర్పు చెప్పింది. వాళ్ళలో రంగబాబూ, అతని మనుషులూ ఉన్నారు. రత్నంగారి మనుషులూ ఉన్నారు. ఆ తీర్పు గురించి ఈనాటి భానూదయానికి 'వర్తమానం' అందించేందుకు రాళ్ళగుర్తులున్నాయి. సూర్యుడు నిన్నటి సంధ్య నిర్దేశించిన తీర్పును ఎంత సమదృష్టితో తెలుసుకున్నాడో రాజయ్య కూడా ఆయా 'శిలాశాసనాల్ని' అంతే నిర్వికారంగా గుర్తించాడు.

అర్జునుడి 'విషాద యోగం' దుఃఖం అయి ఉండదు. తన అవగాహనకు సాధ్యపడదని ఏదో సత్యం తాలుకు అన్వేషణ.

రాజయ్య ప్రస్తుత మానసిక స్థితి దుఃఖాన్ని జవాబుగా అందియ్యలేని పెద్ద ప్రశ్నార్థకం. ఆ ప్రశ్నని చెరిపేనా చెరిపెయ్యాలి. కుదించనైనా కుదించాలి. లేదా మరిచేనా పోవాలి.

గబగబా నాలుగు గ్లాసుల కల్లు కుండలోంచి తీసి గొంతులో పోసుకున్నాడు.

నిక్కరు బిగించుకుంటూ దూరం నుంచి వస్తున్న పోలీసు కానిస్టేబుల్ రాజయ్యని చూస్తూనే 'ఒరెవ్వడాడూ! నంజికొడుకూ!' అని అరుస్తూ పరిగెత్తుకొచ్చాడు.

నాలుగో గ్లాసు పూర్తిచేసి పైకి వచ్చాడు రాజయ్య.

"ఏ(్రా, కుంటి నా కొడకా? ఇక్కడేటి సేస్తన్నవు? నిన్నూ బొక్కల మూసీ మంటవేటి? తేరగ దొరికినాదని, అడిగేవోడెవడూ నేడని కుక్కలా కలబడి పోనావేటి కల్లుకుండ మీదికి?" తిడుతూ రాజయ్యని దూరానికి ఒక్క తోపు తోశాడు పోలీసు జవాను.

రాజయ్య లేచి నిలబడ్డాడు. దులుపుకున్నాడు. క(్ర అందుకున్నాడు. నెమ్మదిగా వచ్చి బల్లముందు కూర్చున్న పోలీసు కాళ్ళముందు నేలమీద చతికిలబడ్డాడు. పోలీసు మొహంలోకి, కళ్ళలోకి చూసాడు.

రాజయ్య కళ్ళు పెద్దగా తెరుచుకుని ఉన్నాయి. సృష్టినీ, నష్టినీ, కాలాన్ని, మనిషినీ ఏకకాలంలో, సంపూర్ణంగా సాక్షాత్కరింపజేసుకుందామన్నంత ఆబగా తెరుచుకుని ఉన్నాయి ఆ కళ్ళు. ఆ కళ్ళల్లో చరిత్ర గజ్జెకట్టి కళాకౌశలాన్ని ప్రదర్శిస్తోంది.

అప్పుడే దేహబాధని తీర్చుకు వచ్చిన పోలీసుకు చాలా హాయిగా, ప్రశాంతంగా ఉంది. రాజయ్య మీద కోపం తెచ్చుకోవాలనుకున్నా రాలేదు.

'ఏ(్రా! ఏటిదీ! ఇక్కడ నీకేటి పన్రా, ముసిలోడా? కావలసిందేదో తాగినావుగా! ఇంకెల్లిపో బేగెల్లిపో. ఇంకో సిటంలో మా యెడ్డుగోరొచ్చినాడంటే నిన్నూ బొక్కల్దోసేత్తాడు. ఎల్లిపో!' ఆర్ద్రంగా, బుజ్జగింపుగా, నెమ్మదిగా అన్నాడు కానిస్టేబుల్.

రాజయ్య కళ్ళల్లోకి చూస్తోన్న అతని కళ్ళనిండా కూడా ఆకాశమే. రాజయ్య హృదయంలోని భావం అతని హృదయంలోకి, ముడిగా, భాషావాహిక లేకుండా, ప్రయాణిస్తోంది. అనుభూతే తప్ప అభివ్యక్తి తెలీదు వాళ్ళిద్దరికీ. తమ అంతరంగాల అల్లకల్లోల్లాన్ని స్పష్టంగా గుర్తించగలిగే తాత్త్వికులు కాదు వాళ్ళిద్దరూ. అయితే, తాత్త్వికులూ, మేధావులూ కాని మానవులకి, హృదయమూ, దానికి స్పందనా ఉండవు అని అనడానికి వీల్లేదు. అజ్ఞానమైనా, అమాయకత్వమైనా, పసితనమైనా అనుభూతి మాత్రం అదే. అందుకే ఆ కానిస్టేబుల్ కంఠంలో ఆ ఆర్ద్రత.

చాలాసేపు ఏమీ మాట్లాడలేదు రాజయ్య. చుట్టూ చూసి, ఒక చేత్తో కానిస్టేబుల్ బూట్లని రుద్దుతూ, మరోచేత్తో చుట్టూ చూపిస్తూ "ఏటి, బాబూ! ఏటిదీ? ఏటండిదీ?!" అన్నాడు. అంటూనే లేచి నిలబడ్డాడు. క(్రతాటించుకుంటూ నెమ్మదిగా కదిలి వెళ్ళిపోయాడు. క(్రకాలు మట్టితో తప్‌తప్‌మంటూ మాట్లాడుతోంది.

వెళ్ళిపోతున్న రాజయ్యను చూస్తూ నెమ్మదిగా ఒక్కొక్క మాటే గొంతు పెగుల్చుకుంటూ అన్నాడు పోలీసు కానిస్టేబుల్ – "నీకు తెల్దే(్రా ముసిలోడా! ఇది యుద్ధం రా!"

అతని సమాధానం సమాధానంలా లేదు. పెద్ద ప్రశ్నలా ధ్వనించింది, మాటలు అంటున్నప్పుడు అనుకోకుండానే, అతనికి తెలియకుండానే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. తీసుకువెళ్ళిపోయారు నిజంగానే, అతనికి, ఆ సమయాన, తన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నట్లు తెలియదు. అతనికి, ఆ సమయాన, తన ఒంటిన ఉన్న ఖాకీ బట్టలు, తన చేతిన ఉన్న లాఠీ, తన ఉద్యోగం, ఏమీ తెలియదు. అతనికి, అప్పుడు, ఆ సమయాన, విశాలమైన ఆ యిరుకు వర్తమానంలో తెలియదు, తనెవరో, ఏం చేస్తున్నాడో, ఎందుకేడుస్తున్నాడో.

పుట్టినప్పుడు తానెందుకేడిచాడో మనిషికి తెలియదు. చచ్చిపోయినప్పుడు తన చుట్టూ అందరూ ఎందుకేడుస్తారో మనిషికి తెలియదు. రాజయ్య అడిగిన ప్రశ్నకి తానెందుకేడిచాడో, ఆ పోలీసు కానిస్టేబుల్‌కి తెలియదు.

వెళ్ళిపోతున్న రాజయ్యకి పోలీసు జవాను చెప్పిన జవాబు వినబడలేదు. వినబడనక్కరలేదు కూడా. అది 'యుద్ధం' అని తెలుసు – మిలటరీ రాజయ్యకి. యుద్ధం అంటే అర్థం కూడా తెలుసు అతనికి. ఆ అర్థాన్ని తన 'కాలు'గా అమర్చుకుని బ్రతుకుతున్నాడు గత కొన్నేళ్ళుగా (మిలిటరీ రాజయ్యకి యుద్ధం తెలియందికాదు) అయితే

'ఎందుకు? ఎందుకూ? ఎందుకిది?' రాజయ్య గొంతులోంచి గుండెలోకి దిగిన కల్లు తనకే తెలియని అతని కేవలం 'ఎందుకు' అనే మూడక్షరాలుగా పోతపోసి సృష్టి అంతటిలోకి పరుస్తూంది. అలా పరుచుకున్న అతని ప్రశ్నార్థకం (పరిదీయం) చేస్తుంది.

2

"ఎందుకు బాబిదీ?" ఆ రోజు ఒక వారగా నిలబడి ఉన్న రాజయ్య రంగబాబుని అడిగాడు. అచ్చు కృష్ణుణ్ణి అర్జునుడు అడిగినట్లే రంగబాబుని రాజయ్య అడిగాడు.

రంగబాబు ఆ ఊళ్ళోకి ప్రవేశిస్తూనే ఒక సంచలనం సృష్టించాడు. ఆ సంచలనం కొందరి హృదయాల్లో 'చైతన్యం'గా, మరి కొందరి మస్తిష్కాల్లో 'అల్లకల్లోలంగా' అర్థాంతరం చెందింది.

మొత్తానికి రంగబాబు రాకతో ఊరు కదిలింది. ఆ కదలికని కొందరు బ్రతుకుబాటగా స్వీకరించారు. మరికొందరు తిరుగుబాటుగా భావించారు రానున్నది మంచి కాలం. అని కళ్ళు తెరిచారు కొందరు. 'వచ్చింది పోగాలం' అని పళ్ళు నూరారు ఇంకొందరు.

ఆ ఊరి చరిత్రలో తరతరాలుగా స్థిరనివాసం ఏర్పరచుకున్నారు రత్నంగారు.

ఈ తరంలోనే మొలిచాడు రంగబాబు. శానా చదువుకున్నోడు. గొప్పోడు. మనపాలిటి దేవుడు, అనే అభిప్రాయ రూపంలో ఒక పాతికమంది 'నవతరం' గుండెల్లో తన విలాసాన్ని ముద్రించుకున్నాడు రంగబాబు.

చరిత్రలో ప్రతి అధ్యాయం ఒక నాయకుడి 'మకుటం' క్రింద విస్తరిస్తుంది.

ఆ ఊరి చరిత్రకు నాయకులు ఇద్దరైనారిప్పుడు. ఎవరి 'మకుటం' ఇకపై అధ్యాయాన్ని నిర్దేశించాలా అన్నది సమస్య.

"రంగబాబు వచ్చి సూపించేదాకా మన బ్రతుకుల్లోని సీకటి మనకి తెలిసినాదేటి? రతనం గోరిలాటి రాచ్చసులికి సీకటేలే, ఆటాడ్డానికేనా, యేటాడ్డానికేనా సరైన టయం. ఇన్నాళ్ళూ - ఇన్నేళ్ళూ, మన చీకటి బ్రతుకుల్తో సెర్లాడినాడు. యెన్నాళ్ళు సెల్లుద్దేటి సీకటిరాజ్జెం? సూరీడొచ్చేదాకానే. సూరీడ్రాగానే సీకటికి గడియలు సెల్లిపోతాయి." రాచ్చసులికి ఆయువు సెల్లిపోద్ది. ఇవి జోగులు చెప్పిన మాటలు. ఆ ఊళ్ళోని ఒక పాతిక ముప్పైమంది హృదయాల్లోని భావం, జోగులు మాటలద్వారా తనను తాను వెలార్చుకుంది.

'హెడ్డింగ్' మారిస్తేనేగానీ 'పాఠం' చదవం అని నిశ్చయించుకున్న ఒక వర్గానికి ప్రతినిధి జోగులు. జోగులు అతని అనుయాయులు తమ జీవిత పాఠాన్ని 'రంగబాబు' శీర్షిక క్రింద పఠించాలనుకున్నారు.

నిజమే! రంగబాబు సూర్యుడిలాగా వచ్చాడు ఊళ్ళోకి. శతసహస్ర జ్ఞానకిరణాలతో ఊళ్ళోని పీడిత, దళిత ప్రజల అజ్ఞానాంధకారాన్ని అమాయకత్వాన్ని పటాపంచలు చేస్తూ ప్రవేశించాడు రంగబాబు.

చీకటి గర్భాన్ని చీలుస్తూ, ఎర్రటి నెత్తురు చిమ్ముకుంటూ వచ్చిన సూరీడు రాత్రి కడుపులో వున్న అందరికీ చెబుతాడు - అప్పటిదాకా తామంతా చీకట్లో ఉన్నట్లు.

వేకువ 'పొడిస్తే' సంధ్య నెత్తురు కక్కడం సహజం.

రంగబాబు ప్రవేశించిన తరువాత రత్నంగారికీ, ఊరికి ఉన్న సంధ్యాసమరాంగణాన సెందిరిగాడి నెత్తురు చిమ్మింది.

ఆ నెత్తుటి వేడితో అప్పటిదాకా చల్లబడిపోయి ఉన్న తమ నరాల ఒత్తుల్ని వెలిగించుకునేందుకు -

ఆ కాంతిలో తమ చీకటి బ్రతుకుల్లో, భవిష్యత్ వేకువ రేఖల్ని తీర్చుకునేందుకు -

'సెందిరి'గాడి 'యెన్నెలంటి' బ్రతుకుని రాకాసి రత్నంగారు 'చీకట్లో మేసేసేరు గనక -

'సెందిరి'గాడి ఆత్మ 'సూరీడై' తమని నడిపించాలని -

రచ్చబండ వద్ద సమావేశమైనారంతా!!

రంగబాబు, తన చూపుడు వేలికి అంటిన, సెందరిగాడి నెత్తురుతో మిగతావారి హృదయఫలకాలమీద, అజ్ఞానపు నల్లబల్లమీద, కర్తవ్యపు అక్షరాల్ని రాస్తూండగా....

ఒక వారగా నిలబడి ఉన్న రాజయ్య రంగబాబుని అడిగాడు 'ఎందుకు బాబిది?" అని.

చిరునవ్వైతే నవ్వలేదుగానీ, అచ్చు కృష్ణుడు అర్జునుణ్ణి చూసినట్లు రాజయ్యని చూస్తూ అన్నాడు రంగబాబు.

"ఎందుకేమిటి - పిచ్చిప్రశ్న! మూతిమీద మీసం ఉన్న మగవాడెవ్వడూ ఈ దెబ్బతిన్న తరవాత ఎందుకూ అని తర్కించడు. దెబ్బకి దెబ్బ. తలకి తల. రక్తానికి రక్తం" అని తన భావానికి కొనసాగింపు చెప్పమన్నట్లు జోగులు వైపు చూశాడు రంగబాబు.

"ఓరయ్యా! నువ్వుండశ.. మా అయ్య మాట్లకేట్లే, రంగబాబూ! యుద్ధంలో కాలుపోయిన కాణ్ణుంచీ ఆడి గుండి పిరికట్టేసినాది. నాయాల్ది ఆ రత్నంగోణ్ణి ఆడిమడుసుల్నీ పుచ్చెలెగరగొట్టెయ్యాలి. అప్పుడుగానీ, ఊరికి సెనొదల్దు. సచ్చిపోయిన సెందిరిగాడికి ఆత్మశాంతి ఉండదు" అని కర్తవ్యం సూచించాడు జోగులు.

'యుద్ధం చెయ్యి, నాయనా!' అని కృష్ణుడు' చెప్పగానే అర్జునుడు 'సరే అని ఒప్పేసుకోలేదు. 'నకాంక్షే విజయం కృష్ణ!' వగైరాంటూ తన పాండిత్యాన్ని, స్వాభిప్రాయాల్ని తెలియజేశాడు.

"ఓర్నాబాబు! నా మాట్నినా తండ్రి!" అంటూ జోగుల్తో చెప్పి, రంగబాబు వైపు తిరిగి అన్నాడు రాజయ్య.

"మీ మూతి మీద మీసం, మీ పౌరుసం మీ ఆడోల్ల పసుపుతాడు తెంచడానిగ్గాదు, బాబూ! పదికాలాలపాటు పచ్చగా ఉంచడానికి. మీ జెబ్బల్లో సత్తువ ఉన్నది మీ పసిబిడ్డల్నెత్తుకు మోయడానికిగాని, ఆల్లని జెబ్బ సత్తువ కొద్దీ దిక్కుమాలినసోటికి ఇసిరీడానిగ్గాదు" అని తన అభిప్రాయాన్ని రంగబాబుకి వ్యక్తం చేశాడు రాజయ్య.

అర్జునుడి అభిప్రాయాల్ని సిద్ధాంతాల్ని పూర్వ పక్షం చేస్తూ తన సిద్ధాంతాల్ని బలంగా ప్రతిపాదించడానికి కృష్ణుడికి పద్దెనిమిదధ్యాయాల సుదీర్ఘోపన్యాసం అవసరం అయింది.

రాజయ్యని అంగీకరింపజెయ్యాలనే సత్సంకల్పానికి రంగబాబుకి కూడా దాదాపు అంత శ్రమా తప్పలేదు.

"రాజయ్యా! నీవు దేశం కోసం పోరాడిన వీర సైనికుడివి. అధర్మాన్ని, అన్యాయాన్ని సహించమని ఎట్లా చెబుతున్నావు? ఎప్పుడో ఒకప్పుడు ఎలాగో ఒకలాగ చావవలసిన వాళ్ళమే కదా అంతా? ఆ చచ్చేదేదో ఈ రత్నంలాంటి నరరూప రాక్షసుడి దురంతాలకు అడ్డుకట్ట వేస్తూ అంతమైపోవడంతో సార్ధకత లేదా? చంద్రంలాంటి అమాయకులు, బలహీనులు ఎంతమంది ఈ విధంగా ఈ రాక్షసుడికి బలైపోవాలి? నువ్వు వల్లించే శాంతిపాఠాలు మన బ్రతుకుల్ని రోజుకోసారి చంపుతాయి.."

రంగబాబు ప్రశ్నల్లో చాలా భాగం అర్థంకాలేదు రాజయ్యకి. అర్థమైన వాటిలో కొన్నింటికి సమాధానం తనకు తెలుసు. కానీ, ఆ తెలిసిన సమాధానం పొంగులువారుతున్న ఈ నెత్తుటి వరదకి ఆనకట్ట కాలేదు. మరికొన్ని ప్రశ్నలకు తనకు తెలిసిన సమాధానం సరైందో కాదో తనకే తెలియదు.

'ఏది సత్యం? ఏదసత్యం? ఓ మహాత్మా! ఓ మహర్షీ!' ఈ మీమాంస ఇప్పుడు రాజయ్యకి, ఒకప్పుడు అర్జునుడికి, వాడికి ముందు మనిషికి పుట్టి అప్పట్నుంచీ అలాగే ఉండిపోయింది.

మొత్తానికి అర్జునుడికి యుద్ధం చెయ్యక తప్పలేదు.

మొత్తానికి రాజయ్య యుద్ధం చూడక తప్పలేదు.

3

ఈ యుద్ధం, ఆ ఒక్క ఊరికే పరిమితంకాదు. ఆ ఒక్కనాటికే పరిమితం కాదు. ఆ యోధులూ, ఆ యుద్ధం అందుకు కారణాలూ, ఆ పరిస్థితులూ. కాలం, చరిత్ర, మనిషి కలిసి రోజూ ఆడుకునే 'బొంగరాలాట'

రాజయ్య కూడా చాలా యుద్ధాలు చూసాడు. చాలా యుద్ధాలు చేసాడు కూడా.

ఒక మనిషితో మరో మనిషి

ఒక జాతితో ఇంకో జాతి.

ఒక 'దైవ సుతుని'తో ఇంకో దైవ ప్రతినిధి.

ఒక అంతస్థుతో మరో అంతస్థు.

ఒక వర్గంతో వేరొక వర్గం.

ఒక ఆదర్శంతో ఇంకో ఆదర్శం.

ఒక సదాశయంతో మరో సదాశయం.

ఒక దేశంతో మరో దేశం.

ఇవిగాక -

ప్రకృతితోను, బ్రతుకుతోను, మృత్యువుతోనూ మనిషి చేసే యుద్ధాలు కూడా చూసాడు రాజయ్య.

వరదలు, అగ్నిప్రమాదాలూ, భూకంపాలూ, భయంకర వ్యాధులూ, కరువుకాటకాలూ వీటితో 'యుద్ధప్రాతిపదిక' మీద మానవుడి భేటీలూ.

గత నలభై ఏళ్ళుగా, కాలం రాజయ్య నేత్ర క్షేత్రంలోకి నిరంతరంగా ఇంకింది. ఏ చదువూ లేని రాజయ్య పొట్ట చేత్తో పట్టుకుని పరుగుపెట్టాడు. ఆకలి వ్యవసాయం చెయ్యడంకోసం, కండల్ని కరిగించి, కళ్ళని దున్నాడు. పొట్టని నింపిన రొట్టెతోబాటు, రాజయ్య కళ్ళ ఒలంలోకి, వివిధానుభవాల విత్తులు కూడా అతనికి తెలియకుండానే, అతని ప్రమేయంలేకుండానే పడి, మొలకెత్తి పెరిగాయి.

ప్రతీ యుద్ధానికీ, ప్రతీపోరాటానికీ, ప్రతీ సంఘర్షణకీ పరమార్థం, పరమావధి ఒక్కటే.

సుస్థిరత! మహాప్రశాంతత.

అశాంత మహాసాగరంలో ప్రశాంతి కోసం అన్వేషణ.

గతంలోంచి శిధిలాల్ని తవ్వి తీసి, భవిష్యత్సోపానాల్ని నిర్మించుకోవాలనుకునే మనిషి ఆరాటం.

ఆ ఆరాటంలో భవిష్యద్ధర్మ్యాల్ని తుత్తునియలు చేసి, వర్తమానం నిండా చెల్లాచెదురుగా పారేసుకునే మనిషి ఆవేశం.

ఆ వర్తమాన శిధిలాల్ని గతంలోకి తోసేస్తూ తిరిగి గతం నుంచి భవిష్యత్తు కోసం... చర్వితచరణ చరిత్రసారం.

పొట్టను నింపిన రొట్టెతోబాటు, రాజయ్య నేత్రక్షేత్రంలో గజిబిజిగా పెరిగిన ఈ అనుభవాల కలుపు మొక్కలూ, వాటిపేరు, అవసరం, ఉపయోగం ఏమీ తెలియదు.

చివరికి వేదాంతం! చీకటిలో నల్లపిల్లికోసం గుడ్డివాడి వెతుకులాట.

ప్రశ్నార్థకాన్ని కళ్ళకి తగిలించుకుని, తానెరిగిన అదే 'పాత'ని, 'ప్రస్తుత'పు అధ్యాయంలో మళ్ళీ పఠిస్తున్నాడు రాజయ్య.

4

ఆరునెలల పసికందును చంకన వేసుకుని, పదహారేళ్ళ ఎంకటలచ్చిమి ఊరిమధ్యలోంచి పరుగుతీస్తూంది - అరుస్తూ, గుండెలు బాదుకుంటూ.

ఒక్క కత్తిపోటుతో చిత్రించారు రత్నంగారు, ఆమె నుదుటిమీద నూరేళ్ళ తెల్లదనాన్ని.

రాజయ్య ఆ సమయంలో రత్నంగారింటి అరుగుమీద కూర్చుని చుట్టకాల్చుకుంటున్నాడు.

తన దౌర్భాగ్యవిధాతని శాపనార్థాలతో ప్రశ్నిస్తూ ఆ ఇంటి ముందునుంచి పరుగుతీసింది వెంకటలక్ష్మి తనని అన్యాయం చేసిన దేవుడి సెవం చూడ్డం కోసం.

దేవుడు వెంకటలక్ష్మి భర్త. రంగబాబు ధర్మానికీ, రత్నంగారి అధర్మానికీ జరిగిన యుద్ధంలో వీర స్వర్గాధిపత్యం పొందిన దేవుడు ఇలలో వెంకటలక్ష్మికి ఘోర నరకం సృష్టించాడు.

వెంకటలక్ష్మి పరుగులు తీస్తూ వెళ్ళిపోయిన కాస్సేపటికి, అటే చూస్తున్న రాజయ్యకి రత్నంగారింటిలోంచి ఆయన భార్య అంటోన్న మాటలు వినిపించాయి.

''పదారేళ్ల పసిగుంట పచ్చని బతుకు బుగ్గైపోనాది. ఈల్ల కచ్చలు మండిపోనూ! ఈల్ల పౌరుసం వొల్లకాటికెల్లా!'' ఆ స్త్రీమూర్తి సహవేదన అలా సాగుతూనే ఉంది.

రాజయ్య కూర్చుని ఉన్న అరుగునానుకుని ఉన్న గదిలోంచి రత్నంగారు ఎవరితోనో నెమ్మదిగా అంటోన్న మాటలు వినిపిస్తున్నాయి.

'చచ!! అంత గభాల్న పొడిసి పారిపోకపోతే, నాలుగుతుకులు ఉతికి ఒగ్గీవోద్దా? తాగుబోతు నాయాల? నీకు మడిసి పేనాలంటే, కోడిపీగ్గోసినంత సులువైపోనాది.. ఆడగుంట ఉసురుసూడు' ఆ కంటంలో మందలింపు ఉంది. ఆవేశం, కావేషం లేవు. పశ్చాత్తాపం లేకపోలేదు.

''అదికాదండయగోరూ! ఆణ్ని ఒగ్గేద్దారనే అనుకున్నాను. కానాడు ఒంటికాలిమీద నెగిసి పోయి గొడ్డలుచ్చుకుని సివాలాడిపోతావుంటే తప్పనేదు మరి'' హంతకుడి సంజాయిషి గొంతులో మానవుడి ఏకరక్త ప్రతిస్పందన రాజయ్యకి వినిపించింది.

'ఈ పాలికేనా ఆల్లూ ఈల్లూ ఒల్లకుంటే ఇంతటితో ఆగుద్దేవో!' అనుకున్నాడు అదే మాట గుడిసెలో జోగుల్తో అన్నాడు.

''ఓపాలి నెత్తుటేరు సూడగానే అన్ని కచ్చలూ సల్లారిపోతాయిరా, నాయినా! మడిసి నెత్తురు మడిసి కల్లసూత్తే అది బూతం నాగా యెంటాడతాదిరా, నా తండ్రీ! నాన్సెప్తున్నానుగాదా! ఆ రత్నంగోరు కూడా యిశారిత్తన్నాడు. యిదైపోతన్నాడు ఈ పాలికి మీలొల్లకోండి అన్నీ అయ్యే సద్దుకుంటాయి - నాయన్నాయినా ఒల్లకోండి''

విన్లేదు జోగులు. ఒల్లకోలేదు వీరభద్రుళ్ళా లేచాడు.

5

పశ్చాత్తాప తన ప్రయత్నాన్ని ఈసారి జోగులు, రంగబాబుల దగ్గర కొనసాగించింది.

''ఏట్రాబాబూ! ఏటలాగున్నావు? నెగు కూడు దినవా?'' రాజయ్య జోగుల్ని కదుపుతూ పిలిచాడు.

జోగులు కుళ్ళికుళ్ళి ఏడుస్తున్నాడు. అతని కళ్ళముందు నలిగిపోయిన పువ్వు అన్నపూర్ణ కదిలింది.

అన్నపూర్ణ రత్నంగారి కూతురు పదిహేనేళ్ళ పిల్ల.

దేవుడి చావుకి ప్రతీకారంగా రంగబాబూ, జోగులూ కలిసి రచించిన ప్రణాళిక, ప్రణాళిక దాకా ఆదర్శవంతంగానే ఉంది. వీరోచితంగా ధర్మబద్ధంగా రచించబడింది. రత్నంగారి పావుల్ని గాకుండా రత్నంగారినే సరాసరి ఢీకొనేందుకు అనుగుణంగా అల్లారు వ్యూహం. కానయితే

యుద్ధానికి వెళ్ళిన యోధులు, మధ్యలో మద్యాన్ని పరామర్శించారు. మద్యం వాళ్ళ ఆలోచనల్లో మంత్రిత్వం నెరిపింది.

శత్రువుని చావుకన్నా ఘోరమైన చావుదెబ్బ తియ్యాలంటే వాడి వీక్ పాయింట్‌ని గురి చూడాలి. అది రాజనీతి. రత్నంగారి ఏకైక సున్నితత్వం ఆయన ఏకైక సంతానం అన్నపూర్ణ.

వీరులు కత్తుల్ని ఒరల్లోకి పెట్టేసి, రాజనీతికి పదును పెట్టారు.

రంగబాబుకి, జోగులుకి తమ ప్రణాళికలో సంభవించిన ఈ చిన్న మార్పు తెలిసేలోగా అన్నపూర్ణ జీవితం నల్లగా మారిపోయింది.

ఫలితం పశ్చాత్తాపం శిబిరం మార్చింది.

"ఇంతన్నాయం జరుగుద్దని అనుకోనేదయ్యా! బావురుమన్నాడు జోగులు. మూడేళ్ళ క్రితం ఆ అన్నపూర్ణని తన భుజం మీద కూర్చోబెట్టుకుని తిరనాళ్ళలో తిప్పి సంబరం చూపించిన దృశ్యం మెదిలింది జోగులు మనస్సులో.

తటాలున లేచాడు జోగులు. పెడకలోంచి కొడవలిని సర్రున దూశాడు. మెడమీద వేసుకోబోతుండగా రాజయ్య పట్టుకున్నాడు.

"నసొగ్గయ్యా! నాను.. మాం మణుసులంగ్నావు. పసువులువీ గావు అంతకన్నా కనికష్టం. మాం బతగ్గాడదు. "

"ఎదవ నిరవాకం జేసినావుకాని, ఇంకొల్లకో!" కొడుకు చేతిలోంచి కొడవలి తీసి దూరంగా విసిరేశాడు రాజయ్య.

6

చకచకా వ్యూహాలు మారాయి. ప్రతీకారపు అగ్నిబాణాలు వచ్చి పడుతున్నాయి రత్నంగారి సైన్యం నుంచి. రంగబాబూ, జోగులూ కసుగందలేదుగాని, అల్పప్రాణాలూ, పిపీలికాలూ ఆహుతైపోతున్నాయి.

ఏడాదిపాటు కడుపులు నింపవలసిన ధాన్యం కుప్పలు నల్లగా మొహాలు మాడ్చుకున్నాయి. బక్కవారి డొక్కల లోగిళ్ళలో రానున్న ఏడాదిపాటు వారాలు చెప్పుకుంది ఆకలి.

రంగబాబులాంటి సూరీడికి మరీ సన్నిహితంగా వెళ్ళినందుకు కొన్ని గుడిసలు భగ్గున నవ్వేశాయి. నవ్వించేశారు రత్నంగారు. ఆయా గుడిసవాసుల్ని ఇక మీదట సూరీడి చూపుల్లోనే తలదాచుకొమ్మని కటాక్షించారు.

"తెలిసో, తెలియకో తప్పు మా వల్ల జరిగింది. చేవవుంటే మమ్మల్ని ఎదుర్కోవాలి. అంతేగానీ, అమాయకులేంజేశారు మధ్యన?" రంగబాబు మాటలు రత్నంగారి చెవిదాకా చేరాయి. అయితే..

అది సవాలో, జవాబో సరిగా బోధపడలేదు రత్నంగారికి, రంగబాబు వర్తమానం సంజాయిషి చెబుతూందా, లేక కవ్విస్తూందా అన్న మీమాంసలో పడ్డారు కాసేపు. కవ్వింపే అయి ఉంటుందని సరిపెట్టుకున్నారు.

పశ్చాత్తాపపు శిబిరం పూర్తిగా బూడిదైపోయింది, రత్నంగారి ప్రతీకారపు అగ్నిబాణాల తాకిడికి.

"నాబం నేదు. ఆయన బాధపడివున్నాడు ఈళ్ళూరుకున్నారు గనకనేటి, ఇప్పుడాయన వూరుకోడానికి. మామూలు పావుకి దండవెట్టి నిలుసుంటే పక్కనించెలిపోద్ది. మరీల్లు దాంతోక దొక్కినారుగాదా? అదూరుకుంటదా?" నిరాశగా అనుకుని కూడా రత్నంగారింటి రాయబారానికి వెళ్ళాడు రాజయ్య.

"ఒరోరి ముసిలోడా! రెండేల్లబట్టీ సూత్తన్నాను నీ కొడుకూ, ఆ రంగబాబూ కలిసి ఊరు ఊరంతట్నీ అగ్గిమంగలం సేసేస్తున్నారు. ఎందుకెందుకని ఓపిగ్గా ఇన్నాళ్ళూ సూసినాను. ఇయ్యాల నా యింటికి సిచ్చుబెట్టినారు. రేపు ఊరంతటికీ అగ్గెట్టెత్తారు. ఈల్లని బతకనిస్తే గ్రేమానికి సాంతినేదు.." శాంతి స్థాపనకే నిశ్చయించారు రత్నంగారు.

"ఈరోజుతో ఈ గ్రామంలో రక్కసి మూకలన్నీ సర్వనాశనం అయిపోవాలి. రాజ్యం అంతమైపోవాలి. ఈరోజు నుంచీ ఈ గ్రామంలో చరిత్ర శాంతి రాజ్యం చెయ్యాలి. చ్ఛాయలో నడవాలి. ఆ శాంతిని ఆవాహన చెయ్యడం కోసం, ఈ యజ్ఞం కోసం ఈ పచ్చని పొలాలన్నిటినీ ఆ పిశాచాల నెత్తురుతో కళ్ళాపి జల్లండి. ఆ రాక్షసుల కపాలాల్తో కాళీమాతను అలంకరించండి" మహాశాంతి యజ్ఞానికి ప్రధాన ఋత్విజుడు రంగబాబు, గంభీరంగా మంత్రోచ్చాటన చేశాడు.

"పిల్లకాకుల కుర్రనెత్తురు. ఉండేల్దెబ్బల అనుబవం నేదు. కొమ్ములికి దురదొచ్చి కొండని ఢీకొడుతున్న గొర్రెలు. కొమ్ములిరిగితే దిమ్మ దిరుగుతాది. కొవ్వు కరుగుతాది. యేడి దిగుతాది!" ఇది రత్నంగారి లోకజ్ఞత.

యుద్ధరంగం సిద్ధమైంది.

"నవయుగానికి నాంది. నిర్మాణానికి పునాది. మానవతా శిశువుకోసం పుత్రకామేష్టి. అట్టడుగునుంచి నిట్టనిలువుగా పైకి లేచిన ఆత్మాభిమానానికి హారతి" ఇది రంగబాబు విజ్ఞత.

యజ్ఞ వాటిక ఏర్పాటయింది.

"అదేటో, ఆల్లకీ యీల్లకీ గూడా సాంతేగావాలంట. అయితే, ఆల్లూ యీల్లూ కలిసి కట్టగట్టుకుని కొట్టుకు సస్తేనేగానీ, ఆ సాంతి కదిల్రాదంట" ఇది రాజయ్యలో అజ్ఞత.

విశ్వరూప సందర్శన 'యోగం' పట్టబోతోంది.

నిర్వచనాలు మూడు.

దృగ్విషయం ఒక్కటే. దృక్కోణాలు వేరు.

7

పోరు ఘోరంగా జరుగుతుండగా, పట్టణానికి కబురు వెళ్ళింది. "పల్లెల్లో అశాంతి విలయతాండవం చేస్తూంది. ప్రజలు పిచ్చెత్తి పుచ్చెలెగరగొట్టుకుంటున్నారు చట్టం, ప్రభుత్వం తక్షణమే కలగజేసుకుని శాంతిని స్థాపించాలి"

ఈ వర్తమానం అందుకుని రక్షకభటులు పటాలం దిగింది. సామ దాన భేదోపాయాలతో ఆవేశాలు అణిగేలా కనబడలేదు. పోరు తగ్గేలా లేదు.

"ఫైర్"

కత్తులు, కొడవళ్ళు, గొడ్డళ్ళు, బల్లాలు కలిసి గంటల తరబడి సాధించలేని శాంతిని మానవుడి పురోగామి మేధ సృష్టించిన తుపాకీ గుళ్ళుపావుగంటలో సాధించాయి.

శాంతి స్థాపన జరిగింది.

నేలను తాకిన శిరస్సుల్నేకాక ఇంకా నిలిచి ఉన్న తలల్ని కూడా చట్టం పట్టుకు వెళ్ళింది. శాంతి శీర్షికతో చరిత్రలో మరో అధ్యాయాన్ని రాసేందుకు.

మునసబు, కరణం, ప్రెసిడెంట్ ఆదిగా గల పెద్దలందరూ వెనకాలే పట్టుకువెళ్ళారు - శాంతికి చట్టాన్ని చట్రంగా బిగించి తెచ్చి ఊళ్ళో అలంకరించాలని.

పుటుక్కున తెగిపోయిన తమ మూడుముళ్ళకి పట్నంలో కోత జరుగుద్దంట? ఆ కోత పూర్తయ్యాక వైధవ్యఫలాన్ని జీవితపు గాదుల్లోకి నింపి తెచ్చుకునేటందుకు పెళ్ళాలందరూ తరలి వెళ్ళారు పట్నానికి ఊరేగింపుగా.

ఆటకైనా, వేటకైనా చీకటి వేళనే అనువైన వేళగా భావించే రాకాసిలాంటి రత్నంగారు శేష జీవితానికి కటకటాల వెనకనున్న చీకటిని అనువైన ప్రదేశంగా ఎన్నుకుని చీకటిలోకి, చీకటితో చీకటిగా వెళ్ళిపోయాడు.

శత సహస్రజ్ఞాన కిరణాలతో ప్రవేశించి, మధ్యందిన మార్తాండ విక్రమంతో ప్రకాశించి, వెలుగుతో, వెలుగులో వెలుగ్గా పరుగు తీసిన రంగబాబు మళ్ళీ మరొకసారి ఎర్రని నెత్తుర్ని అస్త్రాద్రి మీద అభిషేకిస్తూ చీకట్లోకి ఒదిగిపోయాడు.

సూరీడి పిలుపుతో, మేలుకొలుపుతో వెలుగులోకి లేచి, అతనితో పరుగెత్తి పరుగెత్తి, పరుగెత్తి అలసిపోయి గుండెలు అవిసిపోయిన అందరూ నెత్తురు కక్కుకుంటూ చీకటి చితిలోకి ఒరిగిపోయారు.

ఆకాశం తూర్పు పడమరలుగా రెండుసార్లు రక్తాన్ని ఆచమనం చేసింది.

జీవితం తూర్పు పడమరల చీకటి పుటలమధ్య సృష్టి గ్రంథంలో తన చిరునామానిరాసింది.

రాజయ్య ఊరంతా కలియదిరుగుతున్నాడు - కాటికాపరిలాగా. గడియో, క్షణమో శాంతి వస్తుంది ఊరేగుతూ. స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉన్నాడు కాటికాపరిలాగా, ఊరంతా కలియ దిరుగుతున్న రాజయ్య.

తాను మోసుకొచ్చిన నెత్తుటి వాసనల కర్పూర హారతిని ఇచ్చి, శాంతిని ఆహ్వానించడానికి గాలికూడా ఎదురు చూస్తూ రాజయ్యతో బాటు కుంటుతూ తచ్చాడుతూంది.

తన నిట్టూర్పుపాటి నిడివి మాత్రమే ఉన్న ఆ చిన్న ఊరు అరవయ్యేళ్ళపాటు తను చూసిన పెద్ద మనిషి ప్రపంచం అంత అనిపిస్తోంది రాజయ్యకి.

అరవయ్యేళ్ళపాటు తను చూసిన ఎంతో ప్రపంచం, తను చేసిన ఎన్నో యుద్ధాలు, కాలం, మనిషి, వీటి ఆరాటం, ఆ పోరాటం, ఆ లక్ష్యం అన్నీ కలిసి ఊరంతా చిన్నగా కనిపిస్తోంది రాజయ్యకి.

Post your comments